### ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయాలి
### కాంగ్రెస్ శ్రేణులకు కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు అర్కోటం బాలరాజ్ పిలుపు

**కడ్తాల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** కడ్తాల్ మండలం మక్త మాధారం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని (నేడు) సోమవారం 11గంటలకు ప్రారంభించేందుకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత నర్సింహా ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని కడ్తాల్ మండల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు అర్కోటం బాలరాజ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొనాలని బాలరాజ్ పిలుపునిచ్చారు. గ్రామంలో నూతన పంచాయతీ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



రంగారెడ్డి । వికారాబాద్ । మేడ్చల్
వార్త

### వాహనాలతో ప్రమాదకర విన్యాసాలు చేస్తే కఠిన చర్యలు
### పరిగి ఎస్ఐ మోహన కృష్ణ

**పరిగి అక్టోబరు 25 ప్రభాతవార్త:** యువకులు వాహనాలతో ప్రమాదకర విన్యాసాలు చేసినా , అజాగ్రత్త గా అతివేగంగా వాహనాలు నడిపి ప్రజలకు ఇబ్బంది పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని పరిగి ఎస్ఐ మోహన కృష్ణ తెలిపారు.. శనివారం రాత్రి పరిగి పట్టణంలో ప్రధాన మార్గం లో కారుపై కూర్చుని అతివేగంగా కారు నడిపి, వాహనదారులను ఇబ్బందులకు గురిచేసిన నలుగురు యువకులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.. కారుపై ఓ యువకుడు పడుకుని ,ప్రమాదకర విన్యాసాలు చేసినందున కారును సీజ్ చేసారు..నల్గొండ జిల్లా అంబర్ పేట్ కి చెందిన ప్రణీత్ రెడ్డి, రామంతాపూర్ కి చెందిన విశాల్, హైదరాబాద్ అంబర్ పేట కి చెందిన అక్షయ్ ,జనగాం జిల్లా నాగిరెడ్డి పల్లె కి చెందిన చరణ్ లను పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

# కరువు పక్కన పెట్టి రాజకీయాలు

### - మంచినీరు, పంటలపై ధ్యాసలేదు.. - వచ్చే ఎన్నికల కోసం మాజీ ఎమ్మెల్యే ఇంటి చుట్టూ నేతల ప్రదక్షిణలు - తాండూరులో నెలకొన్న వింతపోకడ

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల గడువుంది. భవిష్యత్‌లో నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందా, లేదా, రిజర్వేషన్లు ఎలా ఉంటాయనేది పక్కన బెడితే తాండూరులో రాజకీయ నేతలు అనుసరిస్తున్న వింత పోకడల పట్ల జనం పెదవి విరుస్తున్నారు. దసరా తర్వాత కొంతమంది నాయకులు మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరావు దర్శనం కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. వారిలో ఆల్ పార్టీ నేతలు ఉండటం గమనార్హం. ప్రస్తుతం నారాయణరావు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో ఎలాంటి రాజకీయ పునరేకీకరణ దృశ్యాలు కనిపించడం లేదు. ఒక్క తాండూరులోనే రాజకీయ అలజడి వెనక కారణాలేమిటని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దివంగత మాజీ మంత్రి ఎం.మాణిక్‌రావు, దివంగత కేబినేట్ మంత్రి ఎం.చంద్రశేఖర్‌కు స్వయానా సోదరుడైన నారాయణరావు 2004లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అనంతరం ఆయన కొంత గ్యాప్ తీసుకుని 2014లో మరోసారి పోటీ చేసి ఓటమి చెందారు. అప్పటి నుంచి ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. 1994, 2004, 2014 ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థి మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డిపైనే పోటీ చేశారు. రెండు ఓటములు, ఒక విజయం సొంతం చేసుకున్న నారాయణరావు బషీరాబాద్‌లోనే ఎక్కువగా మకాం వేస్తుంటారు. అయితే, విచిత్రమేమిటంటే ఆయనపై పోటీ చేసిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి సహా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి, ఆయన కుటుంబీకులు, ఇటీవల కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచిన డాక్టర్ సంపత్, నాలుగైదు నెలలుగా నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్న హైదరాబాద్‌కు చెందిన కంజర్ల విజయలక్ష్మి, మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పలువురు నేతలు, ఆశావహులు మాజీ ఎమ్మెల్యే నారాయణరావు దర్శనం కోసం బషీరాబాద్‌లో చక్కర్లు కొడుతుండటం సర్వత్రా చర్చనీయంగా మారింది. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం తీవ్ర రూపం దాల్చుతోంది. గ్రామాల్లో మంచినీటి ఎద్దడి ముంచుకొస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనేక సూచనలు, హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. నీటి వినియోగం, దుబారాను అరికట్టడం, పంటల సాగు, నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి. జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతోంది. ఒకవైపు ప్రజలు ఆందోళనకరమైన పరిస్థితులు ఎదుర్కొనబోతున్నారు. రానున్న ఆరేడు నెలలు గడ్డు పరిస్థితులు ఉత్పన్నం కానున్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితిలో పడగ విప్పిన రాజకీయం బుసలు కొడుతుంటం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, ఆయన సోదరుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డినే టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పిస్తున్నారని రాజకీయవర్గాల సమాచారం. ఎన్నికలకు ఇంకా సమయం చాలా ఉన్నందున పరిస్థితులు తారుమారయ్యే అవకాశాలు ఉన్నాయి. ఏ పార్టీ నుంచి ఎవరు పోటీ చేస్తారో ఇంకా క్లారిటీ లేనందున ఫోకస్ కరువుపై పెట్టాలని ప్రజలు సూచిస్తున్నారు. రాజకీయ నేతల్లో ఒక్కరు కూడా కరువుపై మాట్లాడటం లేదని మండి పడుతున్నారు. వ్యక్తిగత ధూషణలు, అనసర కామెంట్లు చేయడం కన్నా ప్రజల ప్రధాన సమస్యలపై చర్చించాలని అంటున్నారు. భారీ రిజర్వాయర్లు లేని తాండూరు ప్రాంతంలో మంచినీటి ఎద్దడి తలత్తకుండా అఖిలపక్ష సమావేశాలు నిర్వహించాల్సిన తరుణమిది. ఇప్పటికే గ్రామాల్లో చెర్వులు ఎండుముఖం పట్టాయి. ఈసారి పెద్దగా వర్షాలు లేనందున ఒక్క చెర్వు కూడా పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోలేకపోయింది. భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. అక్టోబరు మాసంలోనే 15 అడుగుల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. ముమ్ముందు పరిస్థితి ఎలాగుంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ చర్యలపై అధికార, ప్రతిపక్ష నేతలు చర్చించాలని కోరుతున్నారు.

# నియోజకవర్గంలో ఏ ఒక్కరికి కష్టం వచ్చినా అండగా ఉంటా: స్పీకర్ గడ్డం ప్రసాద్



ఎల్ ఓ సి ని అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్

**ధారూరు, అక్టోబరు 25, ప్రభాత వార్త:** ధారూర్ మండలం మైలారం తండావాసి మోహన్ నాయక్ కూతురు రామావత్ మహేశ్వరి వైద్య చికిత్స ఖర్చుల కోసం తెలంగాణ శాసనసభ సభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ రూ. 2,50,000 (రెండు లక్షల యాభై వేల రూపాయలు) ఎల్ఓసీని మంజూరు చేయించారు. రామావత్ మహేశ్వరి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వెంటనే స్పీకర్ ప్రసాద్ కుమార్ తీవ్రంగా చలించిపోయారు. బాధిత కుటుంబ పరిస్థితిని గ్రహించి, మానవతా దృక్పథంతో వెంటనే స్పందించి, గౌరవ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సాయానికి సంబంధించిన ఎల్ఓసీ మంజూరు అయ్యేలా ప్రత్యేక చొరవతో చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ , మోహన్ నాయక్ కూతురు రామావత్ మహేశ్వరి త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. నా నియోజకవర్గంలో ఏ ఒక్కరికి కష్టం వచ్చినా నేను అండగా ఉంటాను. రామావత్ మహేశ్వరికి మెరుగైన వైద్యం అందించాలని ఇప్పటికే సంబంధిత వైద్యులను కోరాను. మోహన్ నాయక్ కుటుంబానికి ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుంది అని స్పష్టం చేశారు.

**కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు:** తమ కూతురు అత్యవసర పరిస్థితిలో ఉన్న సమయంలో స్పందించి రూ. 2.50 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు, అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మోహన్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.



వెల్జాల్లో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కశిరెడ్డి

## వెల్జా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి ప్రత్యేక పూజలు

**తలకొండపల్లి అక్టోబరు 25,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆదివారం నాడు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెల్జాల్ గ్రామంలోని శ్రీ వేదాద్రి లక్ష్మి నరసింహా స్వామి ఆలయ ప్రాంగణంలో సుదర్శన నరసింహ ధనవంత్రి యజ్ఞం నిర్వహించి పూజలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ వెల్జాల్ గ్రామంలోని వేదాద్రి లక్ష్మి నరసింహ స్వామి దేవాలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తో 3 కోట్ల రూపాయలు మంజూరు చేయించానని, త్వరలో ఈ పనులన్నిటికీ టెండర్ ప్రక్రియ ముగించి త్వరితగదన దేవాలయ అభివృద్ధి పనులు పూర్తి చేయనున్నట్లు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ పనులతో ఈ దేవాలయం ఎంతో అభివృద్ధి చెందుతుందని, వెల్జాల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తులకు ఈ దేవాలయం ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నట్టు ఆయన తెలియజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల పరిధిలోని పడకల్ గ్రామానికి చెందిన రిపోర్టర్ కరుణాకర్ తండ్రి బురుగళ్ల నారాయణ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాద నరసింహ, మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి, అంబాజీ అజీజ్ విష్ణువర్ధన్, నరేందర్ గౌడ్, కృష్ణయ్య అశోక్ తదితరులు ఉన్నారు.

### ఎంబిబిఎస్ విద్యార్థికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సహాయం

**తలకొండపల్లి అక్టోబరు 25, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన వినయ్ రెడ్డి ఎంబిబిఎస్ లో సీటు సాధించారు. ఈ విషయాన్ని రెడ్డి సంఘం అధ్యక్షుడు చిన్న హరి మోహన్ రెడ్డి ద్వారా తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల మండల అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి ఎంబిబిఎస్ సీట్ సాధించిన విద్యార్థికి వ్యక్తిగతంగా 25వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాసు శ్రీనివాస్ రెడ్డి, చిన్నా హరి మోహన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# పొలంలో విద్యుదాఘాతం - రైతు మృతి

### ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా షాక్ - అన్న మృతి, గాయాలతో బయటపడిన తమ్ముడు

**పెద్దేముల్,అక్టోబరు 25, ప్రభాతవార్త:** వ్యవసాయ పొలంలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌కు సర్వీస్ వైరు సరిచేస్తుండగా జరిగిన విద్యుదాఘాతం ఓ రైతు ప్రాణాలను బలిగొంది. స్వల్ప గాయాలతో అతని తమ్ముడికి ప్రాణాపాయం తప్పింది. ఈ సంఘటన పెద్దేముల్ మండలం గోపాల్‌పూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పెద్దేముల్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన తింసాన్‌పల్లి బిచ్చప్ప (38) పొలంలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌కు విద్యుత్ సరఫరా కల్పించేందుకు తమ్ముడు అశోక్‌తో కలిసి సర్వీస్ వైరు మరమ్మత్తులు చేస్తున్నాడు. ఈ క్రమంలో అశోక్ చెట్టుపై ఉండి కొమ్మలను తొలగిస్తుండగా బిచ్చప్ప ట్రాన్స్‌పార్మర్ వద్ద వైరు సరిచేస్తున్నట్లు సమాచారం.ఈ సమయంలో 11 కేవి విద్యుత్ లైన్‌కు జియో వైరు తగలడంతో బిచ్చప్పకు విద్యుదాఘాతం తగలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదాన్ని గమనించిన అశోక్ చెట్టుపై నుంచి కిందకు దిగే క్రమంలో గాయపడినట్లు తెలిసింది. ఈ ఘటనతో పొలంలో ఒక్కసారిగా విషాదం అలముకుంది. వ్యవసాయ పనుల కోసం వెళ్ళిన అన్న తిరిగిరాని లోకాలకు వెళ్ళడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. బిచ్చప్ప మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. పొలం పనుల్లో అన్నదమ్ములిద్దరు నిమగ్నమై ఉండగా చోటుచేసుకున్న ఈ ప్రమాదంతో కుటుంబంలో విషాదం నెలకొంది. భాధిత కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు. వ్యవసాయదారులు, ప్రజలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, హైటెన్షన్ వైర్ల వద్ద మరమ్మత్తులు చేపట్టె సమయంలో సొంతంగా ప్రయత్నించకుండా తప్పనిసరిగా విద్యుత్‌శాఖ (ట్రాన్స్‌కో) సిబ్బందిని సంప్రదించి అవసరమైన ఎల్‌సి (లైన్ క్లియర్) తీసుకున్న తర్వాతే పనులు చేపట్టాలని ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ కోరారు.

### బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమం



మేడ్చల్‌లో పట్టభద్రులకు ఓటు నమోదు పత్రాలను అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

**మేడ్చల్, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** మేడ్చల్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమం క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పట్టభద్రులు పాల్గొని ఓటును నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మల్లికార్జున స్వామి, నాయకులు భాస్కర్ యాదవ్, విష్ణు చారి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు నవీన్ రెడ్డి, నాయకులు పాండు గుప్త, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### రీ సర్వేకు డుమ్మా.. 54 మంది సర్వేయర్ల సేవలు రద్దు

**షోకాజ్ నోటీసులకు స్పందించని వారిపై వేటు అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి స్పష్టం**

**రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 24,ప్రభాతవార్త :** ప్రభుత్వ భూ రీ సర్వే విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 54 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను రద్దు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి వెల్లడించారు. విధులకు హాజరుకాకపోవడంతోపాటు, షోకాజ్ నోటీసులకు స్పందించని వారిపై ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలో మొత్తం 281 మంది లైసెన్స్ సర్వేయర్లను నియమించగా, వారిలో 102 మంది విధులకు హాజరుకాకపోవడంతో అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరిలో 48 మంది నోటీసులకు స్పందించి తిరిగి విధుల్లో చేరగా, స్పందించని మిగిలిన 54 మంది సర్వేయర్ల సేవలను రద్దు చేసినట్లు అదనపు కలెక్టర్ వివరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వే కార్యక్రమంలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర కీలకమని చంద్రా రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ రీ సర్వే పనుల్లో పాల్గొని, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.

## పరిశ్రమలు, గృహనిర్మాణాలకు భారీ నీటి వినియోగం

### ప్రభుత్వం సూచనలు జారీ చేయాలంటున్న నిపుణులు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ఎంతసేపూ రైతులకు సూచనలిచ్చే అధికార యంత్రాంగం పరిశ్రమలలో నీటి దుబారాపై ఫోకస్ చేయడం లేదని విమర్శలు వస్తున్నారు. ఒక్క పరిశ్రమలే కాకుండా గృహ నిర్మాణాలకు కూడా విపరీతంగా నీటి వాడకం జరుగుతోంది. దీనిని కొంతకాలం వరకు అదుపు చేసే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రానున్న ఆరు మాసాల పాటు కొత్త ఇండ్ల నిర్మాణాల అనుమతులకు బ్రేక్ వేయాలని మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఇంటి నిర్మాణానికి అధికంగా నీటి వినియోగం జరుగుతుందని అంటున్నారు. మున్సిపల్, గ్రామపంచాయతీల నుంచి అనుమతులు రాగానే ముందుగా వందలాది అడుగుల లోతు బోరు బావుల తవ్వకాలు చేపడుతుంటారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యేంత వరకు నిత్యం వేలాది లీటర్ల నీటి వినియోగం చేపడుతుంటారు. వాటర్ క్యూరింగ్ పేరిట నీరు దుబారా చేస్తున్నారు.అదే నగర ప్రాంతాల్లో ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా భవనాలు నిర్మిస్తున్నారు. అక్కడ పెద్దగా నీటి వినియోగం లేకుండా ఇండ్లు పూర్తవుతున్నాయి. మున్సిపాలిటీలు, పట్టణాలలో మాత్రం విపరీతమైన నీటి వాడకం, దుబారా జరుగుతోంది. వీటికి తోడు పరిశ్రమలకు కూడా నిత్యం లక్షల లీటర్ల నీటి వినియోగం ఉన్నట్లు సమాచారం. తాండూరు పరిసరాలలో ఆరు భారీ సిమెంట్ కర్మాగారాలు ఉండగా వాటికి అనుబంధంగా వందల సంఖ్యలో నాపరాయి పాలిషింగ్ యూనిట్లు పని చేస్తున్నాయి. ఈ పరిశ్రమలకు నీటి వినియోగం భారీ స్థాయిలో ఉంటుంది. రానున్న వేసవి కాలం ముగిసేంత వరకు పగడ్బంధీ చర్యలు చేపట్టాలని మేధావులు సూచిస్తున్నారు. విద్యుత్ వినియోగం కూడా అధికంగానే ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో నీరు, విద్యుత్ వినియోగం ఆదా చేసే విధంగా పరిశ్రమలకు సూచనలు ఇవ్వాలని అంటున్నారు. అయితే, పరిశ్రమల ద్వారా వివిధ పన్నుల రూపేణా ప్రభుత్వాదాయం భారీగా ఉంటుంది. దాన్ని దృష్టిలో పెట్టుకొని ఎల్‌నినోను ఎదుర్కొనే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచిస్తున్నారు. వీటికి తోడు వాహనాల వాషింగ్ సెంటర్లకు కూడా తగిన సూచనలు ఇవ్వాలని అంటున్నారు. ప్రభుత్వం నిర్మిస్తున్న సిమెంట్ కాంక్రీటు రోడ్లను కూడా ఐదారు నెలల పాటు వాయిదా వేయాల్సి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మరి ప్రభుత్వం ఏ విధమైన నిర్ణయాలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

### ఎమ్మెల్యే మల్లారెడ్డికి పట్టభద్రుల ఓటరు నమోదు పత్రాల అందజేత



ఎమ్మెల్యే మల్లారెడ్డికి పట్టభద్రుల ఓటరు నమోదు పత్రాలను అందజేస్తున్న ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి

**మేడ్చల్, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎల్లంపేట మున్సిపాలిటీలో పట్టభద్రుల ఓటరు నమోదు కోసం పట్టభద్రుల వద్ద నుండి బీఆర్ఎస్ నేతలు సేకరించిన నమోదు పత్రాలను మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి ఆదివారం ఎమ్మెల్యే మల్లారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి వారి ఓటును నమోదు చేయించాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సురేష్‌రెడ్డి, కృష్ణ, నిషిత, భాస్కర్, నాయకులు మాజీ సర్పంచ్ సురేందర్, నాయకులు యూనుస్ పాష, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**మొయినాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. చిలుకూరు కు చెందిన నాగమణి(50) తన కూతురు దగ్గరికి వెళ్ళింది, తిరుగు ప్రయాణంలో అజిత్ నగర్ చౌరస్తాయందు బస్సు గురించి నిలబడి ఉండగా అదే సమయంలో డీసీఎం డ్రైవర్ నిరక్ష్యంగా నడుపుకుంటూ వచ్చి నాగమణిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆమెకు తలకు ఛాతి భాగంలో బలమైన రక్త గాయం అయ్యి చనిపోయింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసారు.

### రోడ్డుకు ఇరువైపులా విస్తరించిన పొదలతో ప్రమాదాలు



**తలకొండపల్లి అక్టోబరు 25 ,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలంలో రోడ్లకు ఇరువైపులా చెట్లు ఏపుగా పెరిగి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. తలకొండపల్లి మండల పరిధిలోని దేవుని పడకల్ వెళ్లే రోడ్డు మార్గంలో, ఆర్య నాయక్ తండ, సూర్య నాయక్ తాండ, పెద్దూర్ తండా, దేవుని పడకల్ గ్రామాల ప్రజలు ప్రతినిత్యం మండల కేంద్రానికి వెళ్లేందుకు ఈ రోడ్డుపై వస్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఏపుగా పెరిగి వాహనదారులకు ఏమాత్రం కనిపించకుండా ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రజల అవసర నిమిత్తం ప్రతిరోజు గ్రామస్తులు ప్రయాణికులు వస్తూ పోతూ ఉంటారు. టూవీలర్ మోటార్ సైకిల్ సైతం వెళ్తున్న ఎదురుగా వస్తున్న వాహనం కనబడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు దేవుని పడకల్ పెద్దూరు తండావాసులు తెలియజేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి ప్రయాణికులకు వివిధ గ్రామాల ప్రజలకు ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు తెలియపరుస్తున్నారు.

### ఎంపి ఈటల రాజేందర్‌కు బిజెపి నాయకుల కృతజ్ఞతలు



ఎంపి ఈటలను కలిసిన బిజెపి నాయకులు

**మేడ్చల్, అక్టోబర్ 25, ప్రభాతవార్త :** మేడ్చల్ పట్టణంలోని రైల్వే వంతెన నుండి రాయిలాపూర్ వరకు గల రోడ్డు విస్తరణకు రూ.6 కోట్లు, రాయిలాపూర్-గౌడవెల్లి రోడ్డులో బ్రిడ్జి నిర్మాణానికి హెచ్‌ఎండీఏ ద్వారా రూ.7.40 కోట్లు మంజూరు చేయించిన సందర్భంగా మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు మేడ్చల్ బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో గిర్మాపూర్, రాయిలాపూర్ గ్రామాల బీజేపీ నాయకులు ఎంపీ ఈటల నివాసానికి వెళ్లి ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ నిధుల మంజూరుతో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రజల రాకపోకలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఈ సందర్భంగా శైలజ సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలు తెలుసుకుని, తమ అభ్యర్థనను పరిగణలోకి తీసుకుని రోడ్డు విస్తరణకు, బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరి చేయించిన ఎంపీ ఈటల రాజేందర్‌కు రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహ, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ లావణ్య, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజనేయులు, నాయకులు సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, రాఘవరెడ్డి, పెంటారెడ్డి పాల్గొన్నారు.

### శారీఫంక్షన్‌కు హాజరైన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

**నందిగామ, అక్టోబరు 25, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రానికి చెందిన ఎదిరే శ్రీహరి గౌడ్ అనూష దంపతుల కుమార్తె సహస్ర శారీ ఫంక్షన్ వేడుకలు ఆదివారం స్థానిక ప్రిన్స్ ప్యాలెస్ గార్డెన్లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి హాజరై చిన్నారి సహస్రను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్, శ్రీధర్ గౌడ్, ఎదిరే శ్రీకాంత్ గౌడ్,కుంచం సంతోష్, సార రవి, బోర్ర ప్రవీణ్ కుమార్ రెడ్డి, చంద్రశేఖర్, బంటు, అగ్గి సురేష్, బి రమేష్ తదితరులున్నారు.ఫోటో రైట్‌అప్ 03: శారీ ఫంక్షన్ లో చిన్నారిని ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి తదితరులు.

## ఫామ్‌హౌస్‌లలో ఆకస్మిక తనిఖీలు

### - అక్రమ మద్యం, హుక్కా పాట్స్ స్వాధీనం



తనిఖీల్లో పాల్గొన్న పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

**మొయినాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ఫామ్‌హౌస్‌లలో పోలీసుల ఆకస్మిక తనిఖీలురంగారెడ్డి జిల్లా, మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ఫామ్‌హౌస్‌లలో 24న రాత్రి చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్, చేవెళ్ల ఏసీపీ శ్రీ కిషన్, మొయినాబాద్ ఎస్‌హెచ్‌ఓ వై. మల్లికార్జున్ రెడ్డి, మొయినాబాద్ డీఐ ఉపేందర్ మరియు పోలీసు సిబ్బంది సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో భాగంగా వన్ వ్యూ ఫామ్‌హౌస్, తోలుకట్ట, వనం ఫామ్‌హౌస్, తోలుకట్ట, ప్రణవిల్లా ఫామ్‌హౌస్, తోలుకట్ట, జెడ్ ఫామ్‌హౌస్, సురంగల్, రాయల్ వుడ్ ఫామ్‌హౌస్, సురంగల్ లో తనిఖీలు చేయగా మొత్తం 26 లీటర్ల అక్రమ మద్యం, నాలుగు హుక్కా పాట్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ ఘటనలకు సంబంధించి పైన పేర్కొన్న ఫామ్‌హౌస్‌ల యజమానులపై, పార్టీ నిర్వాహకుల మీద కేసులు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజల భద్రతకు విఘాతం కలిగించే కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని తెలిపారు. ఫామ్‌హౌస్‌లు, రిసార్టులు మరియు ఇతర ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## దౌల్తాబాద్‌లో కంకర టిప్పర్ బోల్తా

### - తప్పిన ప్రాణనష్టం, ఆందోళనలో స్థానికులు, వాహనదారులు

**దౌల్తాబాద్,అక్టోబరు 25,ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలో రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం తారస్థాయికి చేరింది.నిబంధనలను గాలికొదిలి, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ల తీరుతో స్థానిక ప్రజలు,వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మండల పరిధిలోని రోడ్డు పనుల్లో భాగంగా దౌల్తాబాద్ నుండి గోకఫస్లావాద్ మధ్య ఓ తాండ సమీపంలో కల్వర్టు పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కంకర లోడుతో వెళ్తున్న ఓ టిప్పర్ అత్యంత వేగంగా వచ్చి,ముందు వెళ్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో ప్రాణనష్టం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో నిబంధనలే ప్రామాణికం

## - ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీ లేదు - నిరాధార ఆరోపణలతో అధికారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయొద్దు: టేస్రా యూనియన్

**రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 24,ప్రభాతవార్త :** భూ భారతి చట్టం కింద అందుతున్న భూ సమస్యల దరఖాస్తులను చట్టపరమైన నిబంధనలు, సంబంధిత భూ రికార్డుల ఆధారంగా పారదర్శకంగా పరిశీలించి పరిష్కరిస్తున్నామని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ (టేస్రా) రంగారెడ్డి జిల్లా యూనియన్ స్పష్టం చేసింది. అర్హులైన రైతులు, భూహక్కుదారులకు న్యాయం చేయడంతో పాటు ప్రభుత్వ భూముల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని పేర్కొంది. వాస్తవాలను పూర్తిగా తెలుసుకోకుండా అధికారులపై నిరాధార ఆరోపణలు చేస్తూ వార్తలు ప్రచురించడం సమంజసం కాదని ఖండించింది. 2018 తర్వాత పెండింగ్‌లో ఉన్న పార్ట్‌బి కేసుల్లో స్పష్టమైన ఆధారాలు ఉండి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు వీలున్న దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపింది. అయితే అసైన్డ్ భూములు, మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితుల పేర్లతో ఉన్న భూములు, వక్ఫ్ భూములు, ఇనాం భూములు, భూదాన్ భూములు, శత్రు ఆస్తులు, ఎవాక్యూ ఆస్తులు, పట్టణ భూ గరిష్ఠ పరిమితి (యూఎల్‌సీ), వ్యవసాయ భూ గరిష్ఠ పరిమితి చట్టాలకు సంబంధించిన భూములు, ప్రభుత్వ భూములు, అలాగే ఈడీ, సీబీఐ, ఏసీబీ, ఆదాయపు పన్ను శాఖ తదితర సంస్థల పరిధిలోని అటాచ్‌మెంట్ ఆస్తులకు సంబంధించిన కేసులను అత్యంత జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉంటుందని వివరించింది.

**నిషేధిత జాబితా నుంచి తొలగింపునకు సమగ్ర పరిశీలన:** నిషేధిత జాబితా (పీఓబీ) నుంచి భూములను తొలగించాలంటూ వచ్చే దరఖాస్తులను భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు, సర్వే నివేదికలు, గత ఉత్తర్వులు, భూమి స్వభావం, యాజమాన్య హక్కులు, సంబంధిత శాఖల నివేదికల ఆధారంగా సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుందని యూనియన్ పేర్కొంది. కేవలం దరఖాస్తు చేసుకున్నంత మాత్రాన భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. తగిన పరిశీలన లేకుండా నిర్ణయాలు తీసుకుంటే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉందని తెలిపింది.

**రోజుకు 150 దరఖాస్తులు.. 23,007 పెండింగ్:** రంగారెడ్డి జిల్లాలో భూ భారతి పోర్టల్ ద్వారా రోజుకు సుమారు 150 దరఖాస్తులు అందుతున్నాయని యూనియన్ వెల్లడించింది. ఇప్పటివరకు 3,37,439 దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపింది. మరో 23,007 దరఖాస్తులు వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంది. పెండింగ్ దరఖాస్తుల్లో తహసీల్దార్ స్థాయిలో 9,788, ఆర్డీఓ స్థాయిలో 2,801, అదనపు కలెక్టర్ స్థాయిలో 8,228, కలెక్టర్ స్థాయిలో 2,190 ఉన్నాయని వివరించింది. ప్రతి దరఖాస్తులోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించడం, క్షేత్రస్థాయి వివరాలను నిర్ధారించడం, సంబంధిత శాఖల అభిప్రాయాలు సేకరించడం వంటి ప్రక్రియలకు సమయం పడుతుందని తెలిపింది. మండల స్థాయిలో పరిశీలనతో పాటు అవసరమైన కేసుల్లో కలెక్టరేట్ స్థాయిలోనూ సమగ్ర విచారణ చేపడుతున్నట్లు పేర్కొంది.

**ఒత్తిళ్లకు తలొగ్గి నిర్ణయాలు తీసుకోలేం:** కొంతమంది వ్యక్తులు తమను పత్రిక ప్రతినిధులమంటూ పరిచయం చేసుకుంటూ లేదా మీడియాతో సంబంధాలు ఉన్నాయని చెబుతూ సంక్లిష్టమైన భూ వివాదాలను తమకు అనుకూలంగా పరిష్కరించాలని ఒత్తిడి తీసుకువస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని యూనియన్ పేర్కొంది. నిబంధనల ప్రకారం తక్షణ నిర్ణయం తీసుకోవడానికి వీలులేని కేసుల్లో ఒత్తిడి చేయడం, కోరిన విధంగా నిర్ణయాలు రాకపోతే అధికారులపై ప్రతికూల ఆరోపణలు చేయడం, నిరాధార వార్తలు ప్రచురించడం తగదని తెలిపింది. ఈ తరహా ఆరోపణలకు సంబంధించి నిర్దిష్ట ఆధారాలు ఉంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావచ్చని సూచించింది.

**ప్రజావాణి ఫిర్యాదులకూ ప్రాధాన్యం:** ప్రజావాణి ద్వారా అందే భూ సమస్యల దరఖాస్తులను కూడా ప్రాధాన్యతతో స్వీకరించి, సంబంధిత అధికారుల ద్వారా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని యూనియన్ తెలిపింది. ఏదైనా కార్యాలయంలో అక్రమాలు లేదా అవకతవకలు జరిగినట్లు ఆధారాలు ఉంటే దరఖాస్తు సంఖ్యలు, భూ రికార్డులు, ఇతర ఆధారాలతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొంది. ఫిర్యాదుల్లోని వాస్తవాలు నిర్ధారణ అయిన మేరకు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరింది. ప్రజలు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించింది. ప్రభుత్వ భూముల పరిరక్షణ, అర్హులైన దరఖాస్తుదారులకు న్యాయం చేయడం, భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో పారదర్శకత పాటించడం జిల్లా యంత్రాంగం బాధ్యత అని టేస్రా యూనియన్ స్పష్టం చేసింది. ఆధారాలు లేని ఆరోపణలతో వార్తలు రాయడం వల్ల అధికారుల మనోస్థైర్యం, ఆత్మవిశ్వాసం దెబ్బ తింటాయని పేర్కొంది. పైరవీలకు పాల్పడేవారి ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గకుండా చట్టప్రకారం వ్యవహరించాలని, ఏదైనా అక్రమం జరిగినట్లు ఆధారాలుంటే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.



షాద్‌నగర్‌లో పర్యటించిన తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ సీఎండీ జితేష్ వి. పాటిల్

# ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన

## షాద్‌నగర్‌లో పర్యటించిన రాష్ట్ర విద్యుత్ శాఖ సిఎండి జితేష్ వి. పాటిల్

**షాద్‌నగర్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ సీఎండీ జితేష్ వి. పాటిల్ సూచించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామ, ఫరూక్‌నగర్ మండలాలతో పాటు షాద్‌నగర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నందిగామ మండలం చేగూరు వద్ద ఉన్న కేటీ పరిశోధనా కేంద్రాన్ని సందర్శించి అక్కడి సిబ్బందితో పంటల సాగు, వర్షాభావ పరిస్థితులు, రైతులకు అందించాల్సిన అవగాహనపై చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సీఎండీ జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు. ముఖ్యంగా తక్కువ నీరు అవసరమయ్యే అరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ఏ పంటలు సాగు చేస్తే అనుకూలంగా ఉంటుంది, ఏ పంటలు రైతులకు లాభదాయకంగా ఉంటాయి అనే విషయాలపై పరిశోధనా కేంద్రం ద్వారా రైతులకు అవసరమైన సూచనలు, సాంకేతిక సమాచారం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రైతులు కేవలం నీటి అవసరం ఎక్కువగా ఉండే పంటలపైనే ఆధారపడకుండా, స్థానిక వాతావరణ పరిస్థితులు, భూసారం, నీటి లభ్యత, మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. సజ్జ, జొన్న, రాగి, కంది, పెసర, మినుము, వేరుశనగ తదితర తక్కువ నీటి అవసరం ఉన్న పంటలతో పాటు అనుకూలమైన కూరగాయల సాగుపై కూడా రైతులకు అవగాహన కల్పించవచ్చని పేర్కొన్నారు. కూరగాయలతో పాటు పూల సాగును చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా ఏడాది వరి పంటపై దృష్టి పెట్టకూడదని అవసరమైన చిరుధాన్యాల పంటలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడితే అధిక నీటి అవసరమయ్యే పంటల సాగులో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని, అందువల్ల ముందస్తు ప్రణాళికతో పంటలను ఎంపిక చేసుకోవడం ముఖ్యమని సీఎండీ అన్నారు. రైతులకు అవసరమైన సమాచారం అందించేందుకు పరిశోధనా కేంద్రాలు, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా పరిశోధనా కేంద్రంలోని సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి, కరువు ప్రభావిత ప్రాంతాల్లో అనుకూలమైన పంటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో షాద్‌నగర్ విద్యుత్ శాఖ డీఈ శ్యాంసుందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులతో సీఎండి మాట్లాడారు. పంటలు చివరి దశలో ఉన్నందున కరెంటు సరఫరాలు ఎక్కడ లోపాలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఆ గ్రామాల్లో పర్యటన సందర్భంగా రైతులతో మమేకమై వారి పరిస్థితిలను అడిగి తెలుసుకున్నారు.



కంది పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

# కందిపంటలో సమగ్ర పోషక సస్యరక్షణపై సలహాలు

**షాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** కందిపంటలో అధిక దిగుబడి సాధించడానికి నేలలో పోషకాల సమతుల్యత, తేమ సంరక్షణ, పూత-కాయ దశల యాజమాన్యం, పురుగులు మరియు తెగుళ్లను సకాలంలో గుర్తించడం చాలా ముఖ్యమని మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర సూచించారు. ఈ సందర్భంగా మండలంలో పర్యటించి కంది సాగు చేసిన రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. కందిపంటలో పూత రావడానికి పూత రాలకుండా నివారణకు పూత దశలో జాగ్రత్తలు చాలా ముఖ్యం సకాలంలో సరైన పోషకాలు అందించాలి, వర్షాభావ పరిస్థితులవల్ల భూమిలో పోషకాలు సరిగా అందడం లేదు కావున పూత దశలో రాలిపోతుంది దీనికి పొటాషియం నైట్రేట్ 130 45 ఎకరానికి ఒక కేజీ చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే బెట్ట పరిస్థితులను తట్టుకుని పూత నిలుస్తుంది, మరియు బోరాన్ 20శాతం 1.5 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయడం వల్ల పుప్పొడి నాణ్యత పెరిగి, పూత రాలకుండా కాయగా మారుతుంది. అలాగే ప్లానోఫిక్స్ 0.5మి.లీ/లీటర్ నీటికి కలిపి పిచికారి చేయడం వలన పూత నిలబడుతుంది.

# ప్రధాని మన్ కీ బాత్ వీక్షించిన ఎంపి డికె అరుణ

## - దౌల్తాబాద్ మండలం గోకఫస్లావాద్ గ్రామంలో ప్రత్యక్ష ప్రసారం
## - కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాలను ప్రజలు గమనించాలి: డికె అరుణ

**దౌల్తాబాద్,అక్టోబరు 25,ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం గోకఫస్లావాద్ గ్రామంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న 139వ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ స్థానిక ప్రజలు,పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి వీక్షించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ...దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉత్పత్తి అవుతున్న ఉత్పత్తులు,వస్త్రాలు,విశేషాలను 'మన్ కీ బాత్' ద్వారా ప్రధాని మోదీ దేశ ప్రజలందరికీ తెలియజేస్తున్నారని కొనియాడారు.నేడు ప్రపంచ దేశాలన్నీ భారతదేశం వైపు గౌరవంగా చూసేలా ప్రధాని మోదీ పరిపాలన సాగిస్తున్నారని,ప్రపంచంలోనే అత్యంత ఆదరణ పొందిన నాయకుడిగా ఆయన నిలిచారని తెలిపారు.అత్యంత కష్టకాలమైన కోవిడ్ లాంటి పరిస్థితులతో పాటు,ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు,ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే 4వ స్థానంలో నిలబెట్టిన ఘనత నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు.'ఆపరేషన్ సింధూర్'తో శత్రు దేశాలకు భయం పుట్టించామని,'వికసిత్ భారత్' లక్ష్యంతో ప్రధాని మోదీ నిరంతరం పనిచేస్తున్నారని చెప్పారు.భారతదేశం సాధిస్తున్న అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోతోందని ఆమె విమర్శించారు.విదేశీ వేదికలపై భారతదేశాన్ని కించపరిచే విధంగా రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని,దేశ విచ్ఛిన్నం కోరేవారితో కలిసి ఆయన నడుస్తున్నారని ఆరోపించారు.దేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియ మొదటిసారిగా జరగడం లేదని,ఇప్పటికే 8 సార్లు జరిగిందని గుర్తు చేశారు.తెలంగాణలో కాంగ్రెస్ ఓటు చోరీ చేసి అధికారంలోకి వచ్చిందా అని రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ చేసే అబద్ధపు ప్రచారాన్ని ప్రజలు గమనించాలని సూచించారు.మరోవైపు రాష్ట్రంలోని ప్రజల సమస్యలను పరిష్కరించకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ధర్నాలు చేస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు.కొడంగల్ నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ పేరుతో ఇళ్లను కూల్చివేస్తున్నారని,బాధితులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా కూల్చివేతలు చేయడం అత్యంత అన్యాయమని మండిపడ్డారు.ప్రభుత్వం విధానాల వల్ల రోడ్ల నిర్మాణానికి టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు కూడా ముందుకు రావడం లేదని



ప్రధాని 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎంపీ డీకే అరుణ

పేర్కొన్నారు.కేవలం రోడ్లు మాత్రమే కాకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని,ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14 నియోజకవర్గాలను సమానంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాల్సి ఉండగా,కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే ఇస్తున్నారని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి నిష్పక్షపాతంగా నిధులు మంజూరు చేస్తోందని,రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని స్పష్టం చేశారు.రాబోయే పట్టభద్రుల(గ్రాడ్యుయేట్) ఎన్నికలలో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు.త్వరలోనే నియోజకవర్గంలోని గ్రామ గ్రామాన పర్యటించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి,రతంగ్ పాండురెడ్డి,పగడాకుల శ్రీనివాస్,వికారాబాద్ జిల్లా అధ్యక్షులు రమేష్‌కుమార్,ప్రతాప్‌రెడ్డి,పున్నంచంద్ లాహోటి,కార్పొరేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి,విజయభాస్కర్‌రెడ్డిలతో పాటు మండల అధ్యక్షులు అశోక్,మాజీ అధ్యక్షులు సతీష్,బస్వరాజ్.కేశవ రెడ్డి,శంకర్,బుగ్గప్ప, మురళిధర్,రాజశేఖర్,మహబూబ్‌అలీ,కేశవ్‌రెడ్డి,రాఘవేంద్ర,భాస్కర్,వివిధ మండలాల ముఖ్య నేతలు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేవెళ్ల మున్సిపాలిటీలో కమిషన్ల దందా

## - అధికారులపై ప్లానర్ల ఒత్తిడి.. వారు చెప్పిందే వేదం
## - డమ్మీగా మారిన్ల మున్సిపల్ అధికారులు
## - సెట్‌బ్యాక్ లేదు..రూల్స్ లేవు.. అంతా లక్షల్లో బేరం..

**చేవెళ్ల, అక్టోబరు 25, ప్రభాతవార్త:** గత కొద్దిరోజులుగా చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న లోల్లికి కారణాలపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. కమీషన్‌ల కోసమా?లేక అధిపత్యం కోసమా? అని చర్చ జరుగుతుంది. కార్యాలయంలో జరుగుతున్న తతంగం మొత్తం చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డికి తెలుసా..లేక తెలియదా? చైర్మన్ కనుసన్నల్లోనే జరుగుతుందా అన్న సందేహం కల్గుతుంది. చేవెళ్ల మున్సిపాలిటీ అవినీతికి అడ్డాగా మారుతోందా? నిబంధనల ప్రకారం కార్యాలయంలో కొందరు లైసెన్స్‌డ్ ప్లానర్లు అక్రమ సంపాదనకు అలవాటు పడినట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. చేవెళ్ల మున్సిపల్ కమీషనర్‌పైననే పెత్తనం చేలాయించే స్థాయికి ఓ లైసెన్స్‌డ్ ప్లానర్ ఎదిగారంటే కార్యాలయంలో ఏ స్థాయిలో అవినీతి జరుగుతుందోనని ప్రతి ఒక్కరు గుస గుసలాడతున్నారు. ముడుపులిస్తే కార్యాలయంలో ఏ పనైనా జరుగుందనేది మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అక్రమకట్టాడాలే ఇందుకు నిదర్శనం. చట్టప్రకారం కనీసం సెట్‌బ్యాక్‌ని వదలకుండా నిర్మిస్తున్న ఒక భారీ భవనానికి అనుమతులు ఇప్పించేందుకు, ఓ లైసెన్స్‌డ్ ప్లానర్ మున్సిపల్ కార్యాలయంలోని అధికారులపై వత్తిడి తీసుకువస్తూ కార్యాలయంలో చక్రం తిప్పుతున్నారని చేవెళ్లలో తీవ్ర సంచలనంగా మారింది.లక్షల డీల్.. బేస్‌మెంట్ నుంచే ప్లాన్!తో సహ ఇంటి నంబర్‌ను ఇప్పించే భాద్యత నాదేనని, భవన యజమానితో బేస్‌మెంట్ స్థాయి నుంచి నిర్మాణం మొత్తం పూర్తయ్యే వరకు ఎలాంటి ఆటంకాలు రాకుండా చూసుకునేందుకు ఏకంగా లక్షలాది రూపాయల డీల్ కుదిర్చుకుని ఏకంగా మున్సిపల్ అధికారులపైనే పేత్తం చేలాయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వానికి రావాల్సిన ఫీజుల కంటే, తన జేబు నింపుకోవడానికి.. అధికారులను మేనేజ్ చేయడానికి సదరు ప్లానర్ తెరవెనుక నడుపుతున్న ముడుపుల పర్వం మున్సిపల్ కార్యాలయం సిబ్బంది సైతం ముక్కున వేలేసుకున్నారు. చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న గోడవలకు కారణం అ లైసెన్స్‌డ్ ప్లానరేనని ప్రతి ఒక్కరికి తెలిసిన ఎవరు కూడ నోపు మెదుపలేక పోతున్నారన్న విమర్శలున్నారు.చేవెళ్ల మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అక్రమ భవన నిర్మాణాల ఫైల్‌లను ఎలాగైనా క్లియర్ చేయించి, కమిషనర్ చేత సంతకం పెట్టించడం కోసం సదరు ప్లానర్ గత కొన్ని రోజులుగా మున్సిపల్ కార్యాలయంలో అధికారుల మద్యనే చిచ్చు పెట్టినట్లు తెలిసింది.దీంతో అధికారులు కూడ రెండు గ్రుపులుగా విడిపోయినట్లు సమాచారం. కమిషన్ల వాటాలు సరిగ్గా కుదరకనో లేక నిబంధనల ఉల్లంగించి నిర్మించిడం వలన ఫైల్ పై సంతకం పెట్టేందుకు అధికారులు వెనుకాడుతున్నట్లు సమాచారం. తన డీల్ ఎక్కడ చెడిపోతుందో అన్న భయంతో సదరు ప్లానర్ ఆఫీసులోనే పంచాయితీలు పెడుతూ,చైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డితో సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు కార్యాలయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ఇంత పెద్ద అక్రమ దందా, కమిషన్ల భాగోతం జరగుతున్నా ఈ విషయం మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డికి తెలసా?లేక అమె కనుసన్నల్లోనే జరుగుతుందా?అని పెదనద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవేళ తెలిస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదు? తెలియకపోతే మున్సిపల్ ఆఫీసులో ఇంత బహిరంగంగా బేరాలు జరుగుతుంటే ఎందుకు నిలదీయటం లేదని అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.సాధారణ ప్రజలు ఇల్లు కట్టుకోవాలంటే నిబంధనలు మాట్లాడే అధికారులు.. ఇలా లక్షల రూపాయల కమిషన్ల బేరాలతో వచ్చే ప్లానర్ల విషయంలో ఎందుకు మౌనంగా ఉంటున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. చేవెళ్ల మున్సిపాలిటీని పట్టి పీడిస్తున్న ఈ "కమిషన్ల సిచ్చు"పై ఉన్నతాధికారులు, నిఘా విభాగాలు తక్షణమే స్పందించాలి. సదరు లైసెన్స్‌డ్ ప్లానర్ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, అతని లైసెన్స్‌ను రద్దు చేయడంతో పాటు, ఈ దందాలో భాగస్వాములైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చేవెళ్ల ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

# నిధుల కొరతతో నిలిచిన అంబేద్కర్ భవన నిర్మాణం

## - నాడు మల్కాజ్‌గిరి ఎంపిగా రేవంత్‌రెడ్డి రూ.15లక్షలు నిధులు - ఆ నిధులు సరిపోక అసంపూర్తిగా వదిలేసిన నిర్మాణ పనులు - సిఎం అయ్యారు.. మరిన్ని నిధులు ఇచ్చి నిర్మాణ పనులు పూర్తి చేయించాలని కోరుతున్న దళితులు




శామీర్‌పేట మండల కార్యాలయం బయట అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ భవన నిర్మాణ పనుల పూర్తికి నిధుల కొరతతో అసంపూర్తిలో వదిలేసిన దృశ్యం

**శామీర్‌పేట, అక్టోబరు 25, ప్రభాతవార్త** శామీర్‌పేట మండల కార్యాలయం వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్మిస్తున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన నిర్మాణ పనులు నిధుల కొరతతో నిర్మాణ పనులు పూర్తి చేయక అసంపూర్తితో వదిలేశారు. నాడు గతంలో 2023సంవత్సరంలో మల్కాజ్‌గిరి ఎంపిగా ఉన్న ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి ఈ అంబేద్కర్ భవన నిర్మాణం కోసం దళితసేన నాయకుల కోరిక మేరకు ఎంపి నిధుల నుంచి రూ.15లక్షలు నిధులు మంజూరు చేశారు. అయితే 2024సంవత్సరంలో అంబేద్కర్ భవన నిర్మాణ పనులు ప్రారంభించి 6నెలల వరకు పనులు కొనసాగించి ఆ 15లక్షల రూపాయల నిధులు ఉన్నంత వరకు నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఆ నిధులు ఇక సరిపోక నిర్మాణ పనులు పూర్తి చేయకుండానే వదిలేశారు. గత రెండు సంవత్సరాల నుంచి నిధుల కొరతతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన నిర్మాణం పనులు చేపట్టక అసంపూర్తితో పడి ఉంది. అయితే ఈ అంబేద్కర్ భవన నిర్మాణ పనుల పూర్తి కొరకు సుమారు 25లక్షల వరకు నాడు ఆ అంఛనాలతో ఆ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండల కార్యాలయం వద్ద 2023 ఏప్రిల్ 14న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి నాడు మల్కాజ్‌గిరి ఎంపిగా, టిపిసిసి అధ్యక్షుని హోదాలో ప్రస్తుత సిఎం ఎ.రేవంత్‌రెడ్డి ఉండి నగరం నుంచి శామీర్‌పేట రాజీవ్‌రహదారిన కరీంనగర్‌కు వెళ్తూ శామీర్‌పేట మండల కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల కార్యక్రమంలో నాడు ఎంపిగా రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డిని నాడు అంబేద్కర్ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని దళితరత్న అవార్డు గ్రహీత,రాష్ట్ర దళితసేన నాయకులు తుంకి మల్లేశ్‌తో పాటు పలువురు దళిత నాయకులు కోరటం జరిగిన సంగతి తెలిసిందే. అయితే దీనికి 2023లో ఎంపిగా రేవంత్‌రెడ్డి స్పందించి 15లక్షల రూపాయలు ఎంపి నిధులు ఇస్తానని ప్రకటించి మంజూరు ఇవ్వటం ఆ నిధులతో అంబేద్కర్ భవన నిర్మాణ పనులు ఆ నిధుల వరకు మాత్రం చేశారు. ఆ తరువాత మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని నిధుల మంజూరు చేయాలని కోరగా రూ.10లక్షల రూపాయలు అంబేద్కర్ భవన నిర్మాణం కోసం ఇస్తున్నట్లు ఆయన చెప్పినప్పటికీ నిధులు సకాలంలో అందక నిధులు ల్యాప్స్ అయినట్లు దీంతో అసంపూర్తిలో ఉన్న నిర్మాణ పనులు చేపట్టలేదని అన్నారు. ఆ తరువాత ప్రస్తుత మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ దృష్టికి కూడ ఈ విషయాన్ని తీసుకవెళ్లటం జరిగిందని అసంపూర్తిలో ఉన్న అంబేద్కర్ భవన నిర్మాణం కోసం ఎంపి ల్యాడ్స్ నుంచి నిధులు మంజూరు ఇవ్వాలని కోరటం కలిసి ఆయన దృష్టికి తీసుకవెళ్లినట్లు, ఇంత వరకు మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ నుంచి నిధులు మంజూరు రాలేదని దళితసేన నాయకులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు మాత్రం కేవలం నాడు ఎంపిగా ఉన్న ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన నిధులు ఆ 15లక్షల రూపాయతో మాత్రమే నిర్మాణ పనులు జరిగినట్లు తెలిపారు. నిధుల కొరతతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన నిర్మాణ పనులు అసంపూర్తిలోనే ఉన్నట్లు, సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకవెళ్లటం జరుగుతుందని, నిధుల కొరత పరిస్థితిని వివరిస్తామన్నారు. శామీర్‌పేట మండల కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవనం నిర్మాణ పనులు పూర్తి చేపట్టటానికి సుమారు మరో 25లక్షల వరకు నిధులు అవసరం కానున్నట్లు, సిఎం రేవంత్‌రెడ్డిని దళిత నాయకులుగా కలిసి మరిన్ని నిధులు మంజూరు చేయాలని జిల్లా, మండల స్థానిక నాయకుల సహకారంతో వెళ్లి కలిసి కోరనున్నట్లు రాష్ట్ర దళితసేన నాయకులు తుంకి మల్లేశ్ తెలిపారు. అయితే బిఆర్ అంబేద్కర్ భవన నిర్మాణం ప్రధాన ఉద్దేశ్యం దళిత సామాజిక వర్గ నిరుద్యోగ యువత పిల్లలకు పోటీ పరీక్షల నిమిత్తం ఈ భవనంలో అంబేద్కర్ భోదన కేంద్రం (గ్రంధాలయం తరహాలో) ద్వారా జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ, ఎస్సీ కార్పోరేషన్ సహకారంతో యువతకు విజ్ఞానాన్ని అందించటానికి లక్ష్యంగా ఈ భవనాన్ని నిర్మించ తలపెట్టినట్లు తెలిపారు. శామీర్‌పేట పెద్ద చెరువు పక్కన, రాజీవ్‌రహదారి పక్కన, మండల కార్యాలయ భవన సముదాయం ప్రాంగణం బయట అంబేద్కర్ విగ్రహం వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన నిర్మాణం చేపట్టటం జరుగుతుందన్నారు.

# పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలదే: డివిజన్ అధ్యక్షుడు రాజేశ్

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 25, ప్రభాత వార్త:** త్వరలో జరుగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కొరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలని పోచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ అన్నారు.
పోచారం డివిజన్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం కాచవాని సింగారంలో ఆర్‌కెఎం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాజేశ్ మాట్లాడుతూ డివిజన్‌లో పట్టభద్రుల ఓట్ల కొరకు గ్రామ కమిటీలు చురుగ్గా పనిచేయాలని కోరారు. గ్రామంలో ఎంతమంది పట్టభద్రులు ఉన్నారు. వారు ఎటు వైపు ఉన్నారు. పట్టభద్రులు అయిన వారందరు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకున్నారా లేదా లేనిచో వారితో దరఖాస్తులు చేయించాలని కోరారు. గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలకు వివరిస్తూ పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరముందని కార్య కర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంటు మెట్టు గణేశ్‌యాదవ్, బాలాజీ టెంపుల్ చైర్మన్ నీరుడి కుమార స్వామి, మాజీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ నాయకులు ఆర్. భోజిరెడ్డి, మహిళా సెల్ అధ్యక్షురాలు ఏర్ర మాధవి, ఏర్ర రాజు, దేవేందర్ ముదిరాజ్, బీఎన్. రెడ్డి, మంచాల సుధాకర్, బి. అనిల్ గౌడ్, బి. శ్రీనివాస్ గౌడ్, ఆయా గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షకార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




కాచవాని సింగారంలో జరిగిన డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న అధ్యక్షుడు కర్రె రాజేశ్ తదితరులు

